క్లుప్తంగా

త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం



కొత్తకోట రూరల్: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రతి ఒక్కరూ చదవాలని సేవాసమితి ఇందూ హిందూ జ్ఞాన వేదిక కొత్తకోట కమిటీ అధ్యక్షుడు అన్నారు. ఆదివారం పెద్దమందడి మండలంలోని గట్లఖానాపూర్ గ్రామంలో గ్రంథాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బాలకృష్ణ, పురుషోత్తం, శేఖర్‌రెడ్డి, జాంగీర్, కృష్ణయ్య, మాసన్న, వేణుగోపాల్, హరీష్, శివ, శంకరమ్మ, లయ, మంజుల ఉన్నారు.

సదరం క్యాంపును వినియోగించుకోవాలి

వీపనగండ్ల: జిల్లా మెడికల్ బోర్డు వారు నిర్వహిస్తున్న సదరం క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వీపనగండ్ల సర్పంచ్ నర్సింహారెడ్డి కోరారు. సోమవారం సాయంకాలం 4 గంటల నుంచి మీసేవా కేంద్రంలో సదరం క్యాంపు అందుబాటులోకి వస్తుందని ఆన్‌లైన్ ద్వార దరఖాస్తులు చేసుకున్న వారు పాల్గొని వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు క్యాంపునకు వెళ్లే సమయంలో సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకెళ్లాలన్నారు.

ఉపకులాల సమ్మేళనం జయప్రదం చేద్దాం



వీపనగండ్ల: మాల, మాదిగలతో పాటు దళిత ఉపకులాలుగా ఉన్న వారంతా ఏకమై రాజ్యాంగబద్ధంగా రావాల్సిన హక్కుల కోసం ఉద్యమిద్దామని దండోరా రాష్ట్ర యువసేన ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు, జిల్లా మాల మహానాడు నాయకులు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఈ నెల 21న కొల్లాపూర్ పట్టణంలో నిర్వహించనున్న మాలమాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమ వాల్‌పోస్టర్ల విడుదల కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కల్మూరి రాములు, గడ్డల కుర్మయ్య, గంగులి, రాధాకృష్ణ, శివ, నాని, తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



పాన్‌గల్: టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగినేని అభిలాష్‌రావు జన్మదినం పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ వహీద్ మాట్లాడారు. జిల్లా కిసాన్‌సెల్ ఉపాధ్యక్షుడు లాలయ్యానాయుడు, సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, యాదగిరి, సాయి, నరేష్, కరుణ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు, ప్రొటీన్ పౌడర్ పంపిణీ



వనపర్తి: స్థానిక వల్లభ్‌నగర్ కాలనీలోని ఆశ్రమంలో వృద్ధులకు ఆదివారం రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పండ్లు, ప్రొటీన్ పౌడర్ పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సంస్థ వనపర్తి జిల్లా చైర్మన్ ఖాజా ఖుతుబుద్దీన్, ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ లివింగ్‌స్టన్, నిర్మల వృద్ధులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో సొంత ఖర్చులతో పంపిణీ చేసినట్లు ఆశ్రమం నిర్వాహకులు రాము తెలిపారు.

గట్టుకాడిపల్లిలో ప్రత్యేక పూజలు



ఖిల్లాఘనపురం: మండల పరిధిలోని గట్టుకాడిపల్లి శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవాలయానికి ప్రతి నెల 7న మండలం నుంచి ఎంతో మంది భక్తులు వెళ్లి స్వామివారిని దర్శనం చేసుకుంటారు. అదేవిధంగా స్వామివారు స్వయంభుగా వెలిసిన గట్టుకాడిపల్లి దేవాలయానికి మండలంలోని పలుగ్రామాలతో పాటుగా వనపర్తి తదితర పట్టణాల నుంచి భక్తులు ప్రతి నెల 7న వచ్చి దర్శనం చేసుకుంటున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

అకాల వర్షాలతో ఆగమాగం

- వర్షాలతో 4500 ఎకరాల్లో నిలిచి పోయిన కోతలు
- కల్లాల్లో తడిసి ముద్దవుతున్న వడ్లు
- ఆందోళనకు గురవుతున్న రైతులు



ఖిల్లాఘనపురంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి



శనివారం కురిసిన వర్షానికి షాపురంలో కుంటను తలపిస్తున్న కొనుగోలు కేంద్రం

ఖిల్లాఘనపురం: జిల్లాలో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. వారు లు పడుతున్న తిప్పలు అంతాఇంతా కాదు. ఓ పైపు కొందరు పంటలను కోయలేక అవస్థలు పడుతోంటే, మరోవైపు మరికొందరు చేతికొచ్చిన ధాన్యాన్ని, ఆరబెట్టలేక, వర్షాలకు తడవకుండా రక్షించుకోలేక నానా యాతన పడుతున్నారు. వీటికి తోడు కొనుగోలు కేంద్రాల నిర్వహణలో లోపం రైతులకు ప్రాణసంకటంగా మారింది. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వడ్లను త్వరగా కాంట చేసి వడ్ల బస్తాలను రైస్‌మిల్లులకు తరలిస్తే కొంతవరకైనా నష్టాన్ని అరకట్టవచ్చని వేడుకుంటున్నారు.

10, 519 ఎకరాల్లో వరి సాగు.....

మండలంలో ఈ సంవత్సరం యాసంగిలో 10, 519 ఎకరాల్లో రైతులు వరి పంటలను సాగు చేశారు. నాటిన నెల రోజుల నుంచి పంటకు తెగులు సోకి రైతులను ఇబ్బందులకు గురిచేశాయి. చివరకు పంట కంకులు పట్టే సమయంలో కాండం తొలుచు పురుగు ప్రభావంతో కంకులు ఎండి పోయాయి. ఎలాగోలా ఉన్న పంటను కోసుకుందామనుకున్న సమయంలో వర్షాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ దెబ్బకు ఇంకా 4500 ఎకరాల్లో వరి కోతలు నిలిచి పోయాయని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పంట కోతకు వచ్చినా భూమి ఆరక పోవడంతో కోత మిషన్లు బురదలోకి దిగిపోతున్నాయి. చేసేది లేక రైతులు కోతలు ఆపివేసి వర్షాలు ఎప్పుడు ఆగిపోతాయా అని ఎదురు చూస్తున్నారు. ఇదిలా ఉంటే వర్షాలు రాకముందు పంటలు కోసిన రైతులది మరో గోస. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబెట్టినా, బస్తాలకు నింపడంలో ఆలస్యం అవుతుండటంతో వర్షాలకు కల్లాల్లోని వడ్లు కొట్టుకుపోవడం, తడిసిపోవడం వేధిస్తోంది. మండలంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో 14, ఐకేపీ ఆధ్వర్యంలో 5 గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కేంద్రాల్లో చాలామంది రైతులు ధాన్యాన్ని కుప్పలుగా పోసుకుని వర్షానికి తడవకుండా కవర్లు కప్పి కాపలాగా ఉంటున్నారు. త్వరగాకాంట చేయకపోవడంతో నష్టం తప్పడం లేదని ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



అప్పారెడ్డిపల్లిలో కంకులు విరిగిపోయిన వరి

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

పాన్‌గల్: మండలంలోని కొత్తపేట సమీపంలోని వ్యవసాయ పొలాల్లో 11 కేవీ విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరి పంటలను సాగు చేసిన రైతులు కోతలు కోసే క్రమంలో కిందకు వేలాడుతున్న తీగల వల్ల యంత్రాలు పొలంలోకి రావడం ఇబ్బందికరంగా మారిందని వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో అధికారుల అనుమతితో విద్యుత్ నిలిపివేయించి పనులు చేపట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. సమస్యపై పలుమార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



కోత సమయంలో తీగలను పైకిఎత్తిన రైతులు

వీడని నిర్లక్ష్యం.. దాతృత్వంపై చిన్నచూపు

- నిరుపయోగంగా మారుతున్న ఫీడ్ ది నీడ్ కేంద్రం



నిరుపయోగంగా మారిన ఫీడ్ ది నీడ్ సెంటర్



మోటార్ సైకిల్ బ్యాటరీని చార్జ్ చేసేందుకు ఏర్పాటు చేసుకున్న వైర్

వనపర్తి: ఒక్కపూట భోజనం లేక ఆకలితో మగ్గుతున్న అనాథలు, మతిస్థిమితం లేని వారికి కనీసం ఎవరైనా మిగిల్చిన ఆహారంతోనైనా కడుపు నింపాలనే లక్ష్యంతో 2017లో నాటి కలెక్టర్ శ్వేతా మహంతి దాతల సాయంతో స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఫీడ్ ది నీడ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. మున్సిపల్ పాలకవర్గం నిర్వహణలో ఉన్న ఈ కేంద్రం కొంత కాలంగా కొందరి నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారుతోంది. కేంద్రంలోని ఫ్రిజ్ అద్దం పగిలిపోవడంతో ఇక్కడ ఎవరూ ఆహారం ఉంచడం లేదు. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు ఎలక్ట్రిక్ వాహనదారులు సెంటర్‌లోని విద్యుత్‌ను ఉపయోగించుకుని తమ వాహనాల బ్యాటరీలను చార్జ్ చేసుకోవటం శోచనీయం. దీంతో ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఫీడ్ ది నీడ్ కేంద్రంను మళ్లీ ఉపయోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారులు



మస్తీపురం గ్రామం మిట్టపై..



జూరాల ప్రాజెక్టుపై..

అమరచింత : మండలంలోని పలుగ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులు దెబ్బతినడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారి అధ్వానంగా మారినా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదంటున్నారు. జూరాల ప్రాజెక్టు ప్రధాన రహదారిని కృష్ణా పుష్కరాల సమయంలో పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు రోడ్డు విస్తరణ పనులు ముందుకు సాగడం లేదు. అదే విధంగా మస్తీపురం ఎక్స్‌రోడ్ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు బీటీ రహదారిని పూర్తిచేసినా, మిగిలినా దారిని విస్మరించారు. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రహదారి మరింత అధ్వానంగా మారింది. దీంతో ద్విచక్ర వాహనాలు అదుపు తప్పి వాహన దారులు గాయాల పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తిచేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



మస్తీపురం శివారులో కోతకు గురైన రహదారి

మే డే వారోత్సవాలు



మాట్లాడుతున్న నాయకులు

అమరచింత : కేంద్రంలోని మోదీ సర్కార్ ప్రజాస్వామ్య వ్యవస్థను కూనీ చేస్తూ శ్రమ జీవుల హక్కులను హరిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ.జబ్బార్ అన్నారు. పట్టణంలోని జీఎస్ భవన్ ఆవరణలో ఆదివారం మేడే సందర్భంగా జెండా ఆవిష్కరణ అనంతరం కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకులు మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: దేశంలో కష్టజీవులు ఉన్నంతకాలం ఎర్ర జెండా ఉంటుందని, వారి పక్షాన పోరాటం చేస్తుందని సీపీఐ మండల కార్యదర్శి డంగు కుర్మయ్య అన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా ఆదివారం మండలంలోని వెంగళాయిపల్లి గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించేందుకు ఈనెల 9వ తేదీన మండలంలో పాదయాత్ర ప్రారంభిస్తున్నట్లు వివరించారు. కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. పార్టీ నాయకులు మల్లెపు నర్సింహ, చిన్న కుర్మయ్య, శివ, కుర్మయ్య, చిన్న వెంకటయ్య, శేషయ్య, నరసమ్మ, రాజు, కృష్ణయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



దివ్యశ్రీ తల్లిదండ్రులను ఓదార్చుతున్న వాసంతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని మోజర్ల గ్రామానికి చెందిన నాగేశ్వరి, చెన్నయ్య దంపతుల కుమార్తె దివ్యశ్రీ(7 నెలలు) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. స్థానిక బీఆర్‌ఎస్ నాయకుల ద్వారా మంత్రి నిరంజన్‌రెడ్డికి సమాచారం అందించారు. కాగా మంత్రి పని ఒత్తిడి కారణంగా రాలేకపోవడంతో ఆయన సతీమణి వాసంతి మోజర్ల గ్రామానికి చేరుకొని చిన్నారి దివ్యశ్రీ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాజాప్రకాష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రఘుప్రసాద్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు వేణుయాదవ్ పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి



వేడుకల్లో పాల్గొన్న యువకులు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ఆదివారం రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఠాగూర్ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. జెడ్పీటీసీ సభ్యులు సామ్యనాయక్ ముఖ్యఅతిథి హాజరై ఠాగూర్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో టోపి ముదిరాజ్ పలువురు యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరీమాత ఉత్సవాలు



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆత్మకూర్: చౌడేశ్వరీమాత ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. ఆత్మకూర్ మండలపరిధిలోని తిప్పడంపల్లిలో పద్మశాలీల ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. గ్రామ శివారులోని చౌడేశ్వరీమాత ఆలయం వద్ద ప్రముఖ వేదపండితులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిష్ఠ 40వ వార్షికోత్సవం సందర్భంగా 13 భారీ జ్యోతులతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు, అమ్మవారికి గంగపూజ, అభిషేకం, ఎదుర్కోళ్లు, ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగ జంగ్ సైరన్ విజయవంతం చేద్దాం

ఖిల్లాఘనపురం: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే నిరుద్యోగ జంగ్ సైరన్ సభ ను విజయవంతం చేసేందుకు మండలంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి రావాలని పార్టీ జిల్లా దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు గంజాయి రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా ప్రియాంక గాంధీ హాజరవుతారని వివరించారు.

రైతులను ఆదుకోవాలి

అమరచింత : అకాల వర్షాలకు నెల వరిపంట దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కొంకన్వాని పల్లెలో సుమారు 18 ఎకరాల్లో వరి పంట పూర్తిగా వర్షపు నీటిలో మునిగిందన్నారు. అధికారులు గ్రామాల వారీగా పర్యటించి బాధిత రైతుల వివరాలను నమోదు చేసుకొని ఎకరానికి రూ. 10 వేల చొప్పున నష్ట పరిహారం అందించాలని అన్నారు. లేని పక్షంలో రైతుల తరపున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మల్లేష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మజ్జిగ అందజేత

ఆత్మకూర్: నీట్ పరీక్ష సందర్భంగా ఆత్మకూర్‌లో ఎంవీరామన్‌స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు వాసవీక్లబ్, వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం అల్పాహారం, మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు నీలేష్, నవీన్, రామ్మోహన్, పవన్, శ్రీధర్, యశ్వంత్, భరత్, కిరణ్ యువకులు పాల్గొన్నారు.

రేపు సవరమ్మ జాతర

అమరచింత : పట్టణంలో వెలసిన సవరమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని ఆలయ నిర్వాహకులు వెంకటేశ్వర్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఏటా అమ్మవారి జాతరను ఆనవాయితీగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం అమ్మవారి ఆలయం ఎదుటా పందిరి వేసి పూజలు నిర్వహించి, జాతర కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. భక్తుల కోసం ఆలయం వద్ద సౌకర్యాలు కల్పించామన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



అమరచింతలోని సవరమ్మ ఆలయం

మొరాయిస్తున్న మోటార్లు

- మిషన్ భగీరథ నీటి సరఫరాకు అంతరాయం
- వారంలో మూడు రోజులు ఇదే పరిస్థితి
- ఆందోళనలో 14 గ్రామాల ప్రజలు



సత్యసాయి పంప్ హౌజ్‌లో విద్యుత్ సరఫరా లేక నిలిచిన మోటార్లు

అమరచింత : మిషన్ భగీరథ ద్వార ప్రజలకు నిత్యం స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తున్నామని అధికారులు చేస్తున్న ప్రకటనలకు అనుసరిస్తున్న పద్ధతులకు పొంతన లేకుండా పోతోంది. అమరచింత మండలం జూరాల ప్రాజెక్టు నందిమళ్ల క్యాంపు కాలనీ సమీపంలో సుమారు 25 సంవత్సరాల కిందట ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన సత్యసాయి తాగునీటి పథకం ప్రస్తుతం మిషన్ భగీరథ అదీనంలో కొనసాగుతోంది. కాగా నిర్వహణలో అధికారులు పర్యవేక్షణ లేని కారణంగా సత్యసాయి పంప్ హౌజ్‌లో మోటార్ల పరిస్థితిని పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఎల్‌అండ్‌టీ అదీనంలో సత్యసాయి తాగునీటి పథకం నిర్వహణ ఉన్న సమయంలో నీటిని తోడేందుకు ఉపయోగించాల్సిన 12.5 హెచ్‌పీ రెండు మోటార్‌లు పది సంవత్సరాల నుంచి మరమ్మతుకు నోచుకోవడం లేదు. దీంతో టన్నెల్ నుంచి తాగునీటిని పంప్ హౌజ్‌కు తరలించే యత్నానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. మోటార్‌లకు మరమ్మతు లేనందువల్ల 12.5 హెచ్‌పీ విద్యుత్ మోటార్‌ను ఏకంగా ఎడమ కాలువ వెనుక భాగంలోని నీటిలో అమర్చి తాగునీటిని ఆయా గ్రామాలకు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆ మోటార్ సైతం మరమ్మతుకు నోచుకోని కారణంగా ఐదు రోజుల నుంచి నీటి సరఫరా 14 గ్రామాలకు నిలిచింది.

పర్యవేక్షణ లోపం...

సత్యసాయి తాగునీటి పథకం ద్వారా ఆయా గ్రామాలకు నిత్యం తాగునీటిని అందించడమే కాకుండా పని చేస్తున్న సిబ్బందికి క్రమం తప్పకుండా నెలనెల వేతనాలను అప్పట్లో అందించేవారు. కొన్ని సంవత్సరాల కిందట ఎల్‌అండ్‌టీ ఆదీనంలో కొనసాగిన వేతనాలకు కొదువ లేకుండా ఉండేది. ప్రస్తుతం మిషన్‌భగీరథ ఆదీనంలో పథకం నిర్వహణ ఉండటంతో వీటిని సమగ్రంగా పరిశీలిస్తూ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయలేక పోవడంతో పంప్ హౌజ్‌లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయన్న విషయాలను అధికారులు తెలుసుకోలేక పోతున్నారు. ప్రస్తుతం వాటర్ గ్రీడ్, మిషన్ భగీరథ అంటూ సమస్యను పట్టించుకోక దాటవేస్తున్నారు.



జూరాల ప్రాజెక్టు వద్ద ప్రధాన ఎడమకాల్వలో మోటార్‌ను వదులుతున్న సిబ్బంది

చర్యలు తీసుకొంటున్నాం...

సత్యసాయి తాగునీటి పథకం ద్వారా తాగునీటి సరఫరాకు అంతరాయం రాకుండా చర్యలు తీసుకొంటున్నాం. వారం రోజుల కిందట వీచిన ఈదురు గాలులు, అకాల వర్షాల కారణంగా విద్యుత్ సమస్య కలిగింది. వీటిని పరిష్కరించే లోపు స్టాటర్‌లు కాలిపోయాయి. ప్రస్తుతం తాగునీటిని ఆయా గ్రామాలకు అందిస్తున్నాం.

–సులక్షణ, ఏఈ మిషన్ భగీరథ

మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో శారీరక దేహదారుఢ్యంతోపాటు మానసికంగా ఎదగవచ్చని జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి, కింగ్‌షోటోకాన్ వైస్ చైర్మన్ చెన్నవీరయ్య అన్నారు. కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో ఆదివారం 25వ వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నవీరయ్య మాట్లాడుతూ కరాటే నేర్చుకునేవారు చదువులో కూడా ముందుంటారన్నారు. కరాటే శిక్షణ శిబిరాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో 25 ఏళ్ల నుంచి ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తుండడం అభినందనీయం అన్నారు. క్లబ్ విద్యార్థులు నేపాల్, దుబాయ్, విజయవాడ, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన అంతర్జాతీయ కరాటే పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే శిక్షణ తీసుకోవాలని కోరారు. కింగ్‌షోటోకాన్ కరాటే క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ, కార్యదర్శి అబ్దుల్ జకీ, బీఆర్‌ఎస్ నాయకుడు వినోద్, క్లబ్ ఉపాధ్యక్షులు బాలు, మహేందర్ నాయక్, హమీద్ అలీ, కోశాధికారి తిరుపతయ్య పాల్గొన్నారు.